

జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు ఆలస్యం - 7లో
వృద్ధురాలిపై అత్యాచారం కేసులో ఇద్దరు యువకులు అరెస్టు - 7లో
జనసేన వీరమహిళల పోరాటస్ఫూర్తి అభినందనీయం: పవన్ - మెయిన్‌లో



కాయ్ రాజా కాయ్!



- అసెంబ్లీ ఎన్నికల ఫలితాల గడువు దగ్గరపడడంతో ఊపందుకున్న బెట్టింగ్‌లు
- జిల్లావ్యాప్తంగా రూ.650కోట్లకుపైగానే పందేలు దాటుంటాయని అంచనా
- టీడీపీ విజయం ఖాయమంటూ అత్యధికంగా రూ.300కోట్లకుపైగా బెట్టింగ్‌లు
- పిఠాపురంలో పవన్ కళ్యాణ్ మెజార్టీపై రూ.లక్ష నుంచి రూ.కోటి వరకు..
- 30వేల నుంచి 50వేల వరకు మెజార్టీ అంచనాలతో జిల్లావ్యాప్తంగా పందేలు
- అన్ని నియోజకవర్గాల్లోను పవన్ మెజార్టీపైనే భారీ ఎత్తున పందేలు
- తుని, కాకినాడ సిటీ, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోను భారీ పందేలు
- కాకినాడ జనసేన, వైసీపీ ఎంపీ అభ్యర్థుల గెలుపోటములపైనా పోటాపోటీ బెట్టింగ్‌లు
- చెరో రూ.2.50కోట్ల చొప్పున కాకినాడలో రెండు వర్గాల బెట్టింగ్
- పలువురు వైసీపీ నేతలూ కూటమికి అనుకూలంగానే బెట్టింగ్‌లు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సమయం దగ్గరపడ్డంతో జిల్లాలో బెట్టింగ్‌లు భారీగా ఊపందుకున్నాయి. టీడీపీ కూటమిదే విజయం అంటూ జిల్లావ్యాప్తంగా కోట్లలో పందేలు జరుగుతున్నాయి. గ్రామాలనుంచి పట్టణాల వరకు ఎక్కడ చూసినా పందేల జాతరే కనిపిస్తోంది. దీంతో జిల్లావ్యాప్తంగా ఎన్నికల ఫలితాల బెట్టింగ్‌లు రూ.650కోట్లకుపైగానే దాటి ఉంటాయని అంచనా వేస్తున్నారు. ప్రధానంగా టీడీపీ ప్రభుత్వం విజయం సాధిస్తుందనే అంశంపైనే అధికంగా బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. సీట్లు ఎన్ననేదానిపై రూ.లక్ష నుంచి రూ.50లక్షల వరకు పందేలు కాస్తున్నారు. ఆ తర్వాత అత్యధికంగా పిఠాపురంలో పవన్‌కళ్యాణ్ మెజార్టీ ఎంతనేదానిపై అన్ని నియోజకవర్గాల్లోను పెద్దఎత్తున బెట్టింగ్‌లు రూ.50వేల నుంచి రూ.కోటి వరకు కాస్తున్నారు. అత్యధికంగా 30వేలు దాటుతుందని ఓ వర్గం, 50వేలపైనే అనే మరో వర్గం క్రాస్ పందేలు కాస్తున్నారు. ఆ తర్వాత నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థుల విజయం, ఆధిక్యత, ఫలానా బూత్‌ల్లో ఎవరిది ఆధిపత్యం అనేదానిపై రూ.10వేలనుంచి రూ.10లక్షల వరకు పందేలు కాస్తున్నారు. కాకినాడ జనసేన, వైసీపీ ఎంపీ అభ్యర్థుల గెలుపోటములపైనా పందేలు భారీగా జరుగుతున్నాయి. నగరంలో రెండు వర్గాలు వీరిద్దరి విజయంపై చెరో రూ.2.50కోట్లతో పందేలు కట్టారు. ఎన్నికల ఫలితాలపై టీడీపీ కూటమికి అనుకూలంగా వైసీపీ నేతలు పలువురు పందేలకు దిగుతుండడం విశేషం.

కాయ్ రాజా కాయ్..

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు ఇంకా 12రోజుల సమయమే ఉండడంతో జిల్లాలో బెట్టింగ్‌లు పెద్దఎత్తున ఊపందుకున్నాయి. ఫలితాలు టీడీపీ కూటమికి అనుకూలంగా ఉంటాయనే లెక్కలతో పందెంరాయుళ్లు పెద్దఎత్తున బెట్టింగ్‌లు వేస్తున్నారు. ఈదఫా ఫలితాలు ఏకపక్షంగా ఉంటాయని, అధికార వైసీపీకి ఓటమి తప్పదనే అంచనాలు భారీగా వ్యక్తమవుతుండడంతో పందేలు సైతం ఒకవైపే ఎక్కువగా కొనసాగుతున్నాయి. దీంతో వైసీపీ వైపు పందేలు కాసే నాథుడే పెద్దగా కనిపించడం లేదు. కొందరు వైసీపీ నేతలైతే తమ పార్టీ తరఫున పందేలు కాస్తే డబ్బులు పోతాయన్న భయంతో టీడీపీ విజయంపైనే ప్రత్యర్థి పార్టీ నేతలతో కలిసి బెట్టింగ్‌లు వేస్తున్నారు. రాష్ట్రం లోను, జిల్లాలోను ఎన్ని సీట్లు వస్తాయనే లెక్కలపై పందేలు వేస్తున్నారు. ప్రధానంగా జిల్లాలో ఏడుకు ఏడు, ఏడుకు ఆరు రావచ్చనే అంచనాలతో బెట్టింగ్‌లు ఎక్కువగా జరుగుతున్నాయి. రాష్ట్రంలో 110 నుంచి 140 వరకు వస్తాయని కొందరు, 140కిపైనే అని మరికొందరు బెట్టింగ్‌లు కాస్తున్నారు. ఇలా జిల్లావ్యాప్తంగా టీడీపీ కూటమి విజయం, సాధించే సీట్లపై రూ.300కోట్లకుపైగా పందేలు జరుగుతున్నాయి. ఆ తర్వాత అత్యధికంగా పిఠాపురంలో పవన్‌కళ్యాణ్‌కు ఎన్ని ఓట్ల మెజార్టీ వస్తుందనే అంశంపైనా జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో పందేలు జరుగుతున్నాయి. 30వేలకుపైనే వస్తాయని పిఠాపురంలో క్రాస్ పందేలు రూ.50వేలనుంచి రూ.కోటి వరకు కాస్తున్నారు. 30వేలకుపైగా మెజార్టీ వస్తే రూ.కోటి పందేనికి రూ.50లక్షలు ఇచ్చేలా, 30వేల లోపు మెజార్టీ వస్తే రూ.కోటికి కోటి ఇచ్చేలా పందెం రాయుళ్లు బెట్టింగ్‌లు వేశారు. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట, కాకినాడ సిటీ, పెద్దాపురంలో సైతం పవన్ మెజార్టీ 50వేల కుపైనే ఉంటుందని కొందరు, 50వేల లోపు వస్తుందని మరికొందరు పందేలు కాశారు. ఇవన్నీ కలిపి జిల్లావ్యాప్తంగా రూ.250కోట్లకు వరకు పందేలు జరుగుతున్నట్లు అంచనా. టీడీపీ అభ్యర్థుల్లో జగ్గంపేటలో జ్యోతుల నెహ్రూ, ప్రత్తిపాడులో సత్యప్రభ, కాకినాడ సిటీలో జనసేన అభ్యర్థి నానాజీ గెలుస్తారనే దానిపైనా, ఒక్కొక్కరి మెజార్టీలు పదివేలకుపైనే ఉంటుందనే అంశంపైనా ఆయా నియోజకవర్గాల్లో బెట్టింగ్‌లు కోట్లలో జరుగుతున్నాయి. కాకినాడ రూరల్‌లో నానాజీకి పదివేల మెజార్టీ వస్తుందని టీడీపీనుంచి ఓ నేత రూ.10లక్షలకు బెట్టింగ్ కాశారు. ప్రత్యర్థి వైసీపీనుంచి తమ అభ్యర్థి కన్నబాబు గెలుపు పందెం కాయడానికి ఎవరూ రాలేదు. కానీ నానాజీకి పదివేల మెజార్టీ రాదంటూ ఓ వైసీపీ నేత రూ.10లక్షల పందేనికి సిద్ధమయ్యారు. ఈ నియోజకవర్గాల్లో బూత్‌ల వారీగాను పందేలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. ప్రత్తిపాడులో వైసీపీ అభ్యర్థి వరుపుల సుబ్బారావు స్వగ్రామం లింగపర్తిలో టీడీపీ అభ్యర్థి సత్యప్రభకు మెజార్టీ వస్తుందంటూ రూ.1లక్ష నుంచి రూ.3లక్షల వరకు పందేలు జరుగుతున్నాయి. పెద్దాపురంలో టీడీపీ అభ్యర్థి రాజప్ప, వైసీపీ అభ్యర్థి దవులూరి ఇద్దరిలో విజయం ఎవరిదనేదానిపై బెట్టింగ్‌లు పందెంరాయుళ్లు వేసినా వైసీపీ వైపు పందేలు కాయడానికి ఎవరూ ముందుకు రాలేదు. దీంతో రాజప్ప మెజార్టీపై టీడీపీ, వైసీపీలో ఇరు వర్గాలు రూ.లక్షనుంచి రూ.10లక్షల వరకు రూరల్ గ్రామాల్లో పందేలు జరుగుతున్నాయి. కాకినాడ సిటీలో టీడీపీ అభ్యర్థి కొండబాబు ఆధిక్యతపై టీడీపీలోనే కొందరు పోటాపోటీగా రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు పందేలు కాస్తున్నారు. వైసీపీ అభ్యర్థి ద్వారంపూడికి అనుకూలంగా పందేలు కాసే పరిస్థితి కనిపించడం లేదు. అటు కాకినాడ జనసేన, వైసీపీ ఎంపీ అభ్యర్థుల్లో విజయం ఎవరిని వరిస్తుందనేదానిపై బెట్టింగ్‌లు భారీగా జరుగుతున్నాయి. విజయం తమదేనని రెండు వర్గాలు పోటాపోటీ బెట్టింగ్‌లు వేస్తున్నాయి. జనసేన అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్, వైసీపీ అభ్యర్థి సునీల్ నెగ్గుతారంటూ ఓ రెండు వర్గాలు కాకినాడలో చెరో రూ.2.50కోట్లతో బెట్టింగ్‌లు నడుపుతున్నారు. పెద్దాపురం, ప్రత్తిపాడులోను ఇద్దరు అభ్యర్థుల విజయంపైనా బెట్టింగ్‌లు పెద్దఎత్తున జరుగుతున్నాయి.

మండు టెండల్లో..
నేటి నుంచి మూడురోజులపాటు తాగునీటి సరఫరా బంద్

- 15 డివిజన్ల ప్రజలకు తప్పని పాట్లు
- లక్ష మంది పైగా జనాభాపై ప్రభావం
- మొక్కుబడిగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

కాకినాడ సిటీ, మే 22: మండు టెండల్లో పైపులైన్ మరమ్మతుల పేరిట మూడురోజులపాటు కాకినాడ నగరంలోని 15 డివిజన్లలో తాగునీటి సరఫరాను బంద్ చేస్తున్నారు. మొక్కుబడి ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో అధికార యంత్రాంగం తీసుకున్న ఈ నిర్ణయంతో లక్షమందికి పైగా జనాభాపై తాగునీటి కొరత ప్రభావం చూపనుంది. కనీసం ఏ డివిజన్‌లో కూడా వాడకం నీటికోసం నేల బోర్లు పని చేయడం లేదు. వేసవిలో తాగునీటి ఎద్దడిని తీర్చిన సురక్ష వాటర్ ప్లాంట్లు మూతపడ్డాయి. అరకొరగా ఉన్న తాగునీటి సరఫరా ట్యాంకర్లు ద్వారా శివారు ప్రాంతాలకు నీరు అందిస్తున్నారు. మరి ఈ మూడురోజులపాటు 15 డివిజన్లలో ఎలా తాగునీరు సరఫరా చేస్తారనే దానిపై స్పష్టత లేకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎందుకంటే డివిజన్లలోని కార్పొరేటర్లు మాజీలు కాగా, ఎన్నికల కోడ్‌వల్ల సిట్టింగ్ ప్రజాప్రతినిధులు సమస్యను సమీక్షించలేని పరిస్థితి ఏర్పడింది. జిల్లా కలెక్టర్‌నుంచి కార్పొరేషన్ కమిషనర్ వరకు అందరూ అధికారులు ఈవీఎంల భద్రత స్ట్రాంగ్ రూమ్‌లపై దృష్టి కేంద్రీకరించిన నేపథ్యంలో మూడురోజులపాటు తాగునీటి సరఫరాను బంద్ చేస్తే ఎదురయ్యే సమస్య తీవ్రతను గుర్తించలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సామర్లకోట కెనాల్ నుంచి శశికాంత్‌నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్‌కు వచ్చే పైప్‌లైన్‌కు ఏర్పడిన లీక్ అరికట్టేందుకు దీని పరిధిలోని రిజర్వాయర్లకు ఈ నెల 23, 24, 25 తేదీల్లో తాగునీటి సరఫరా నిలుపుదల చేస్తున్నారు. పర్యావసానంగా ఈ ఫిల్టరేషన్ ప్లాంట్ నుంచి తాగునీరు సరఫరా జరిగే 1 నుంచి 13 డివిజన్లు, 49, 50 డివిజన్లకు సంబంధించిన శశికాంత్ నగర్, శ్రీవిద్యాకాలనీ భాస్కర్‌నగర్, దుమ్ములపేట, సాంబమూర్తినగర్, ఏఎంజీ స్కూల్ ఏరియా, శ్రీనివాస బ్యాంక్‌కాలనీ, గైగోలుపాడు ప్రాంతాల్లోని రిజర్వాయర్లకు గురువారం ఉదయం నుంచి శనివారం సాయంత్రం వరకు తాగునీరు పంపింగ్ కాదు. దీంతో ఆయా ప్రాంతాల ఇళ్లలోని కుళాయిల నుంచి ఒక్క చుక్క తాగునీరు సరఫరా కాదనే సమాచారం ప్రజల్లో గుబులు పుటిస్తోంది. తాగునీటి సరఫరా నిలుపుదల చేసే డివిజన్లలో జన సామర్థ్యంగల ఇరుకు ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయని, ఆయా ప్రాంతాల ప్రజలు ముందస్తుగా తాగునీటిని ఎక్కడ నిల్వ చేసుకుంటారని మాజీ కార్పొరేటర్లు ప్రశ్నిస్తున్నారు. పూర్తిస్థాయిలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని పక్షంలో అరకొరగా వచ్చే ట్యాంకర్ల దగ్గర తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నీటి యుద్ధాలు తప్పని పరిస్థితి ఏర్పడుతుందని చెబుతున్నారు. అందువల్ల ఈ మూడు రోజుల పాటు తాగునీరు సరఫరా నిలుపుదల చేసే 15 డివిజన్లలో ఒక్కో డివిజన్‌కు రెండు చొప్పున అదనంగా ట్యాంకర్లు ఏర్పాటు చేసి ఆ తర్వాత పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరుతున్నారు.

ఏసీబీ వలలో జిల్లా పరిశ్రమలశాఖ జీఎం

- రూ.2లక్షలు లంచం తీసుకుంటూ చిక్కిన వైనం
- ఏసీబీని ఆశ్రయించిన ఐస్ ఫ్యాక్టరీ ఓనర్

- మెయిన్‌లో



ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

ఓట్ల లెక్కింపు ఏర్పాట్ల పరిశీలన

కలెక్టరేట్(కాకినాడ), మే 22: కాకినాడ జేఎన్‌టీయూలో వివిధ నియోజకవర్గాలవారీగా ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను బుధవారం జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. జేఎన్‌టీయూకేలోని బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో పిఠాపురం, మెకానికల్ ఇంజనీరింగ్ బ్లాక్‌లో కాకినాడ రూరల్, సివిల్ ఇంజనీరింగ్ బ్లాకులో కాకినాడ పట్టణం, ఆడిటోరియంలో పెద్దాపురం నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియకు చేస్తున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఆర్వోలకు పలు సూచనలు చేశారు. తొలుత పిఠాపురం నియోజకవర్గం, నియోజకవర్గానికి సంబంధించిన బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. ఈ పర్యటనలో కాకినాడ పట్టణ, కాకినాడ రూరల్, పెద్దాపురం నియోజకవర్గాల ఆర్వోలు వెంకటరావు, ఇట్ల కిషోర్, సీతారామరావు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ఏపీఈఏపీసెట్‌కు 96.72 శాతం విద్యార్థులు హాజరు

- 7లో

ఆరోగ్యశ్రీ ఆస్పత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను
ప్రభుత్వానికి నివేదిస్తాం: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మే 22: జిల్లాలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ప్రైవేటు ఆస్పత్రులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని, ప్రజలకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందిస్తున్న ఆరోగ్య సేవలను ప్రైవేటు ఆస్పత్రులు యథావిధిగా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. కాకినాడలోని కలెక్టరేట్ కోర్టు హాలులో జిల్లాలోని వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆరోగ్య సేవలు అందిస్తున్న ప్రైవేటు ఆసుపత్రుల ప్రతినిధులతో బుధవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద 3250 చికిత్సలకు పేదలకు ఉచితంగా అందిస్తూ సాలినా రూ.3వేల కోట్లు వెచ్చిస్తూ దేశంలోనే ఆదర్శంగా, అందరికీ ఆరోగ్యం అందించే లక్ష్యానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చేరువలో నిలిచిందన్నారు. ఈకృషిలో ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు, ప్రైవేటు నెట్ ఆస్పత్రులు కీలక భూమిక వహిస్తున్నాయన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మెరుగైన పేకేజీ చెల్లింపులను ప్రభుత్వం నెట్‌వర్క్ ఆస్పత్రులకు అందిస్తోందన్నారు. వివిధ కారణాలవల్ల ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు కొద్దికాలంగా చెల్లింపులు జాప్యం జరుగుతున్న దృష్ట్యా, బిల్లుల సత్వర చెల్లింపులకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అనంతరం ఆరోగ్యశ్రీ పథకం అమలులో నెట్‌వర్క్ ఆస్పత్రులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీ ఆస్పత్రులు రూ.106 కోట్లు చెల్లింపు జరపాల్సి ఉండగా ఇందులో రూ.75కోట్ల మేరకు ప్రైవేటు ఆస్పత్రులకు చెల్లించాల్సి ఉందని ఆస్పత్రుల ప్రతినిధులు తెలియజేశారు. 45 రోజులలోపు బిల్లులు చెల్లింపు అందనందున ఆర్థికపరమైన ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నామన్నారు. కన్సల్టెంట్ వైద్యులకు, సిబ్బందికి జీతాలు, మందులు సరఫరా చేసే వెండర్లకు బిల్లులు, బ్యాంకు రుణాలు చెల్లించలేకపోతున్నామన్నారు. ఈ కారణంగా తమ ఆస్పత్రుల సేవలపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. ఆర్థిక ఒత్తిడివల్ల తమ ఉనికికే సవాలు ఎదురౌతోందన్నారు. ఆస్పత్రుల ప్రతినిధులు తమ సమస్యలను విన్నవించారు. వివిధ సేవలకు నిర్ణయించిన పేకేజీ మొత్తాలు సహేతుకంగా లేవని వాటిని రివైజ్ చేయాల్సి ఉందని, సేవల నాణ్యత ఆధారంగా ఆస్పత్రుల గ్రేడింగ్ చేయాలని కోరారు. ప్రైవేటు ఆస్పత్రుల సమస్యలన్నిటినీ రాష్ట్రప్రభుత్వ దృష్టికి నివేదిస్తామని, ప్రజా ఆరోగ్య పరిరక్షణ ప్రాధాన్యత దృష్ట్యా ఎటువంటి అంతరాయం లేకుండా ఆరోగ్యశ్రీ పథకం కింద సేవలను కొనసాగించాలని కలెక్టర్ జిల్లాలోని నెట్‌వర్క్ ప్రైవేటు ఆస్పత్రులను కోరారు. ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ రాధాకృష్ణ, డీఎంహెచ్‌వో నరసింహనాయక్, ఐఎంఏ, ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నివాస్



హాజరైన వివిధ పార్టీల ప్రతినిధులు, సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ



ఎన్నికల కౌంటింగ్, ఫలితాల ప్రక్రియ సజావుగా సాగాలి

- చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించం: ఎస్పీ

కాకినాడ క్రైం, మే 22: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్, ఫలితాల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎస్పీ సుబ్రమణి సతీష్‌కుమార్ కోరారు. జూన్ 4న జరగబోయే ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఆయన కాకినాడ సూర్యకళామందిరంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జూన్ 6వతేదీ వరకు ఎన్నికల కోడ్, 144 సెక్షన్, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్‌లు అమలులో ఉన్నందున ప్రజలు ఎవరూ కూడా నలుగురికి మించి ఒక చోట గుంపుగా చేరరాదన్నారు. కౌంటింగ్ రోజు అనవసరంగా రోడ్లు మీదికి వచ్చి గొడవలకు కారకులై క్రిమినల్ కేసుల్లో ఇరుక్కోవద్దని హితవు పలికారు. ముఖ్యంగా ఇతరులను కించపరిచే వ్యాఖ్యలు చేసి కవ్వింపు చర్యలకు పాల్పడడం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే జిల్లా పోలీస్‌శాఖ ఉపేక్షించబోదని ఎస్పీ హెచ్చరించారు. అని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు శాంతియుతంగా ఉండాలన్నారు. ముందస్తు అనుమతులు లేకుండా ఊరేగింపులు, ర్యాలీలు చేయరాదన్నారు. జూన్ 6 వరకు నమోదయ్యే క్రిమినల్ కేసులన్నింటిని ప్రత్యేకంగా పరిగణించి ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలో ఆయా కేసులు అన్నింటిలో శిక్షలు పడేలా ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి డాక్టర్ కె.హనుమంతురావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



రౌతులపూడి సమీపంలో రహదారిపై పట్టపగలు ట్రాక్టర్‌పై తరలిపోతున్న దుంగలు

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

- పట్టపగలు లారీల్లో తరలిస్తున్నా పట్టించుకునే వారు కరువు
- అమలు కాని ఓల్టా చట్టం

తుని రూరల్, మే 22: తూర్పు కనుమల్లో అటవీశాఖ పరిధిలో పచ్చదనం రోజురోజుకూ కనుమరుగవుతోంది. ఓల్టా చట్టం అమల్లో ఉన్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీరుగారుతోంది. వేల హెక్టార్లలో అటవీ భూముల చెట్లను నరికి తరలిస్తున్నారు. పట్టపగలు లారీల్లో తరలించినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. తూర్పు కనుమల్లో అరుదైన చెట్లను అక్రమార్కులు అధికారులు కళ్లు కప్పి ఏదో ఒక చోట చెట్లను నరికేస్తున్నారు. అక్రమ కలప పెద్ద ఎత్తున జరిగినా రాజకీయ నాయకుల ఒత్తిడితో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఓల్టా చట్టం అమలు చేయాల్సిన రెవెన్యూ, అటవీ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులు మామూళ్లకు తలొగ్గడం అక్రమార్కులకు వరంగా మారిందన్న వాదనలు వినిపిస్తున్నారు. నిత్యం ఏవో ఒక ప్రాంతంలో చెట్లను నరికి ట్రాక్టర్ల ద్వారా తరలించే దృశ్యాలు రహదారులపై కనిపిస్తున్నాయి. అటవీ ప్రాంతాలనుంచి కొందరు అక్రమార్కులు టేకు చెట్లు అనుమతు లేకుండా టింపర్ టిపోలకు తరలించి పలు వస్తువులుగా మార్చి బయటకు తరలిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదంతా అటవీ శాఖ కనుసన్నల్లో సాగుతున్నాయనే ఆరోపణలున్నాయి. ప్రతిఏటా ఆయా టింపర్ డిపోల నుంచి మామూళ్లు అందడంతో చూసీచూడనట్లు వదిలేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

నిబంధనలు ఇవి

ప్రభుత్వ నియమ, నిబంధనల ప్రకారం రైతు పొలాల్లో, రహదారులు, కొండల్లో చెట్లు నరికి వేయాలంటే ఓల్టా చట్టం ప్రకారం సర్వే నెంబరుతో సహా తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకుని అనుమతి తీసుకోవాలలి. అనంతరం రెవెన్యూ అధికారులు పరిశీలించి అటవీ అధికారులకు నివేదిక పంపించాలి. అధికారుల అనుమతికోసం రూ.400 చలానా చెల్లించి రెండు శాఖల ఆమోదం లభించాకే చెట్లు నరికి తరలించే అవకాశం చేయాలి. క్షేత్రస్థాయిలో అధికారులకు ప్రజలు దరఖాస్తు చేస్తున్న దాఖలాలు లేవు. అడ్డగోలుగా చెట్లు నరికి వ్యాపారం నిర్వహిస్తున్నారు.

కోనసీమలో పరిఢవిల్లిన బౌద్ధం



ఆదుర్రు బౌద్ధ స్థూపం

అమలాపురం టౌన్, మే 22: మానవునిగా జన్మించి భగవంతునిగా ఎదిగిన వారిలో బుద్ధ భగవానుడు ఒకరు. తథాగతుడు చూపిన మార్గమే నేడు బౌద్ధ ధర్మంగా విశ్వవ్యాప్తమైంది. మహోన్నతమైన బౌద్ధ ధర్మం ఏనాడో కోనసీమ జిల్లాలో పరిఢవిల్లింది. జిల్లాలో పలుచోట్ల బౌద్ధ ధర్మ ప్రచార అవశేషాలు నేటికీ లభ్యమవుతున్నాయి. బౌద్ధ ధర్మ ప్రచారంలో భాగంగా నిర్మించిన బౌద్ధ చైత్యాలకు ప్రత్యేక స్థానం ఉంది. దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన బౌద్ధ చైత్యాలు సారనాథ్, అమరావతిలతో పాటు ఆదుర్రులో మాత్రమే ఉన్నాయి. 1930వ దశకంలో బ్రిటిష్ పాలకులు మద్రాసులోని ఆర్కియాలజీ డిపార్టుమెంటు సహకారంతో చేపట్టిన పరిశోధనల్లో ఆదుర్రు బౌద్ధ క్షేత్రం బయటపడింది. ఈ బౌద్ధ చైత్యాన్ని అశోక చక్రవర్తి కుమార్తె సంఘమిత్ర ధర్మ ప్రచారంలో భాగంగా నిర్మించినట్టు చారిత్రక ఆధారాలున్నాయి.



పురాణ ప్రసిద్ధినొందిన ద్రాక్షారామం కూడా బౌద్ధ ఆరామమేనని బుద్ధిస్టుల నమ్మకం. అదే విధంగా సామర్లకోటలోని భీమేశ్వరాలయంలో బుద్ధుని ప్రతిమలను ఇందుకు నిదర్శనంగా చెప్తారు. బౌద్ధ ఆరామాలతో పాటు స్థూపాల కింద బుద్ధుని కాలం నాటి అవశేషాలు ఉంటాయని వారి ప్రగాఢ నమ్మకం. అశోక చక్రవర్తి దేశవ్యాప్తంగా 84వేల స్థూపాలను నిర్మించారు. వీటన్నింటిలో బుద్ధుని దాతువులు ఉంటాయి.

దుఃఖానికి మూలం కోరిక

దుఃఖానికి ఎన్నో కారణాలు ఉండవచ్చు. కానీ మూల కారణం మాత్రం కోరిక అని బుద్ధుడు చెబుతాడు. దుఃఖ నివారణకు ఎనిమిది మార్గాలను ఆయన సూచించారు. పున్నమి చంద్రునితో బౌద్ధ ధర్మం ఎంతో ముడిపడి ఉంది. ఇక వైశాఖ పౌర్ణమికి గౌతమ బుద్ధునితో విడదీయరాని సంబంధం ఉంది. ప్రపంచ చరిత్రలో అపూర్వ సంఘటనలుగా అవి నిలిచాయి. వైశాఖ పౌర్ణమి రోజున లుంబినీ వనంలో సిద్ధార్థుడుగా గౌతముడు జన్మించాడు. వైశాఖ పౌర్ణమి రోజునే ఇల్లు విడిచి ఉరువేల అటవీ ప్రాంతానికి చేరుకుని రావి చెట్టు (బోధి వృక్షం) కింద జ్ఞానోదయం పొంది గౌతమ బుద్ధుడయ్యాడు. మరలా వైశాఖ పౌర్ణమి రోజునే కుశినగర్‌లో బుద్ధుడు మహాపరినిర్యాణము చెందారు. బుద్ధుని జీవితంలోని ప్రధాన ఘట్టాలన్నీ వైశాఖ పౌర్ణమి రోజునే జరగడం చరిత్రలోనే అపూర్వ సంఘటనగా నిలిచింది.

నేడు బుద్ధ జయంతి వేడుకలు

అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో గురువారం బుద్ధ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, త్రిరత్న బుద్ధ విహార్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరుగుతాయి. ఉదయం బౌద్ధ భిక్షువులచే పూజా కార్యక్రమాలతో ప్రారంభించి బుద్ధ భగవానుని ప్రతిమ, పంచశీల జెండాలతో ప్రత్యేక వాహనంపై ఊరేగింపు నిర్వహిస్తారు. బీఎస్ఐ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులతో పాటు కలెక్టర్‌హిమాన్షు శుక్లా, బుద్ధ విహార్ వ్యవస్థాపకుడు గొల్లపల్లి సూర్యారావు పాల్గొంటారని అధ్యక్షుడు నాగాబత్తుల ప్రసాదరావు తెలిపారు.

పునర్జన్మను అంగీకరించని బౌద్ధం



బౌద్ధం పునర్జన్మను అంగీకరించదు. ఆత్మవాదానికి పూర్తిగా వ్యతిరేకం. ఎందుకంటే ఆత్మవాదంతోనే కుల వ్యవస్థకు బలం వచ్చింది. బుద్ధుని అనాత్మవాదం ఆత్మలేదని చెబుతుంది. బౌద్ధ ధర్మంలో పాప పుణ్యాలున్నాయి. మంచి పనులు, చెడు పనులు ఉన్నాయి. అయితే ఆయా పనుల ఫలితాన్ని ఈ జన్మలోనే అనుభవించక తప్పదని చెబుతుంది. బౌద్ధం ప్రధానంగా మానవీయత గురించి క్రీస్తుకు పూర్వమే చెప్పింది.

డీబీ లోక్, త్రిరత్న బుద్ధవిహార్ సెక్రటరీ జనరల్

ఘనంగా నృసింహ జయంతి



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

అంతర్వేది, మే 22: అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం నృసింహ జయంత్యుత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం 5 గంటలకు స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. 8 గంటలకు నక్షత్ర మాలదీక్షాధారులతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. తొలుత విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్నిప్రతిష్ఠాపన, మహాశాంతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా జిల్లా నుంచి వచ్చిన భక్తులు ఇరుముళ్లు సమర్పించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వామివారి జన్మ నక్షత్రం స్వాతిని పురస్కరించుకుని 27 రోజుల పాటు భక్తి శ్రద్ధలతో దీక్ష నిర్వహించిన భక్తులు బుధవారం స్వామివారి సన్నిధిలో జరిగిన ఇరుముడి కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి విశేష పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు పి.శ్రీనివాసకిరణ్, స్థానాచార్యులు వి.రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వెంకటశాస్త్రి, అర్చకులు జి.రాజేష్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న చైర్మన్, ఈవో







అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో కిక్కిరిసిన అన్నవరం

అన్నవరం, మే 22: సత్యదేవుడి వార్షిక కల్యాణోత్సవాలలో నిర్వహించే గ్రామసేవలలో భాగంగా బుధవారం సాయంత్రం రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. సాయంత్రం 5 గంటలకు నవ దంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను రూ.1.20 కోట్లతో తయారు చేయించిన నూతన టేకు రథంపై ఆశీనులు గావించారు. చైర్మన్ ఐ.వి రోహిత్, ఈవో రామచంద్రమోహన్ రథోత్సవం ప్రారంభించారు. నూతన రథానికి కుంభం పోసి ముందుకు కదిలించారు. తొలిపావంచా వద్ద నుంచి ప్రారంభమైన రథోత్సవం మంగళవాయిద్యాలు, పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఆంధ్రాబ్యాంక్ వరకు వెళ్లి అక్కడనుంచి సత్యదేవుడి కొండపైకి వెళ్లే టోల్‌గేట్ వరకు కొనసాగి తిరిగి పంపాసత్రం వద్ద ముగిసింది. ఆలయ అధికారులు తొలిసారిగా పెద్దరథంతో ఉత్సవాన్ని చేపట్టడంతో అశేష భక్తజనంతో అన్నవరం మెయిన్‌రోడ్డు జన సందోహాన్ని తలపించింది. దేవస్థానం ఉద్యోగులు యావన్మంది ఈ రథోత్సవంలో పాల్గొనాలని ఈవో సర్క్యులర్ జారీ చేయడంతో ప్రతిఒక్క ఉద్యోగి హాజరయ్యారు. టీడీపీ నాయకుడు రఘురామకృష్ణంరాజు దంపతులు రథోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. 3500 కిలోల బరువుతో సుమారు 35 అడుగులు పొడవున్న ఈ రథసేవ తొలిసారి ప్రారంభించడంతో ఎటువంటి అవాంతరాలు జరగకుండా నిష్ణాతులైన మత్స్యకారులతో రథం లాగించారు. ఈవో రామచంద్రమోహన్ మైక్ ద్వారా సూచనలిస్తూ కార్యక్రమం కొనసాగించారు. వాహనాలను బైపాస్ మీదుగా మళ్లించారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి పర్యవేక్షణలో సుమారు 100 మంది పోలీసులు తగు జాగ్రత్తలతో బందోబస్తు నిర్వహించారు. అంతకు ముందు రథాన్ని తయారు చేసిన శిల్పులను ఈవో, చైర్మన్ రోహిత్ సన్మానించారు.

నయనానందకరం సత్యదేవుడి వనవిహారం

పూజలు నిర్వహిస్తున్న పండితులు





అన్నవరం, మే 22: సత్యదేవుడి వార్షిక దివ్య కల్యాణోత్సవాలలో భాగంగా బుధవారం వన విహార మహోత్సవం నయనానందకరంగా జరిగింది. వివాహ బడలికలో ఉన్న నవ దంపతులు సేదతీరేందుకు ప్రతీకగా ఈ వేడుకను నిర్వహిస్తారు. నవ దంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను కొండపై నుంచి పల్లకిలో మేళతాళాలు, మంగళవాయిద్యాలు, పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ కొండదిగువున ఉన్న ఉద్యానవనానికి తీసుకుని వచ్చారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వెండి సింహాసనంపై నవ దంపతులను మరోవేదికపై పెండ్లిపెద్దలైన సీతారాములను ఆశీనులు గావించారు రుత్వికులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం చతుర్వేద పండితుల వేదాశీర్వచనం అనంతరం కొండపైకి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా విశేష పదార్థాలను నివేదించి భక్తులకు పంపిణీ చేశారు.

ఏపీఈఏపీ సెట్‌కు 96.72 శాతం మంది హాజరు

నేటితో ముగియనున్న పరీక్షలు

జేఎన్టీయూకే, మే 22: కాకినాడ జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల్లో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి బుధవారం ఉదయం నిర్వహించిన పరీక్షకు 927 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 887 మంది హాజరయ్యారని, 40 మంది గైర్హాజరు కాగా 95.69 శాతం హాజరు శాతం నమోదైనట్లు కన్వీనర్ ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. అదే విధంగా మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 934 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 913 మంది హాజరయ్యారని, 21 మంది గైర్హాజరు కాగా 97.50 శాతం హాజరు శాతం నమోదైందన్నారు. మొత్తం రెండు సెషన్‌లలో 1,861 మంది హాజరు కావాల్సి ఉండగా 1,800 మంది హాజరయ్యారని 61 మంది పరీక్ష రాయలేదని 96.72 శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు. అదే విధంగా తూర్పుగోదావరి జిల్లాలో ఇంజనీరింగ్‌లో ప్రవేశాల కోసం రాజమహేంద్రవరం ఐయాన్ డిజిటల్ కేంద్రంలో ఆన్‌లైన్‌లో రెండు సెషన్‌లలో నిర్వహించిన పరీక్షకు 1,434 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1404 మంది హాజరు కాగా మొత్తం 97.91 శాతం హాజరు నమోదైందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని భట్లపాలెంలో గల బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో రెండు సెషన్లలో బుధవారం నిర్వహించిన ఇంజనీరింగ్ విభాగ పరీక్షకు 690 మంది హాజరు కావాల్సి ఉండగా 671 మంది హాజరు కాగా మొత్తం 97.25 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ తెలిపారు. ఏపీఈఏపీసెట్ ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన ప్రవేశ పరీక్షలు గురువారం ముగియనున్నాయన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.10 లక్షల విరాళం





దాతలు రత్నాకరరావు, లక్ష్మీశమంతకమణి

అన్నవరం, మే 22: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి బుధవారం విజయవాడకు చెందిన కేతినేని రత్నాకరరావు, లక్ష్మీశమంతకమణి దంపతులు రూ.10 లక్షలు విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని దాతలు దేవస్థానం నిత్యాన్నదాన అకౌంట్‌కు పంపించినట్లు అధికారులు తెలిపారు. దాతలను ఈవో ఫోన్‌లో అభినందించి వారికి దాతల కోటాలో అందించే సదుపాయాలను త్వరితగతిన పంపించాలని అన్నదానం అధికారులను ఆదేశించారు.

3 గంటల ఆలస్యంగా జన్మభూమి ఎక్స్‌ప్రెస్

సామర్లకోట, మే 22: విశాఖ-సికింద్రాబాద్ మధ్య రాకపోకలు సాగించే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు బుధవారం మూడు గంటల ఆలస్యంగా సామర్లకోట చేరుకోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విశాఖ నుంచి బయలుదేరిన జన్మభూమి రైలు ఏసీ బోగీ లింక్ విడిపోయింది. సాంకేతిక లోపంతో విడిపోయిన ఏసీ బోగీ సమాచారాన్ని పైలట్ ముందుగా గుర్తించి అప్రమత్తం కావడంతో విడిపోయిన రెండు ఏసీ బోగీలను తిరిగి లింక్ తగిలించే పనులు నిర్వహణ దృష్ట్యా సుమారు మూడు గంటల పాటు ఆలస్యం అయ్యింది. దీంతో సామర్లకోటకు జన్మభూమి రైలు మధ్యాహ్నం 12 గంటలకు చేరుకుంది. రైలు రాక కోసం ఎదురుచూసిన ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ప్రయాణికులకు సరైన సమాచారాన్ని అందజేయకపోవడంతో స్టేషన్లో అందుబాటులో ఉన్న ఆహారాన్ని అధిక దరలు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వచ్చిందని ప్రయాణికుడు ఫణిశేఖర్ ఆరోపించారు.

అశ్రునయనాలతో కృష్ణబాబుకు వీడ్కోలు

స్వగ్రామం దొమ్మేరులో అంత్యక్రియలు



విలపిస్తున్న కృష్ణబాబు సోదరుడు




కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తెలంగాణ మంత్రి తుమ్మల


కొవ్వూరు, మే 22: బంధుమిత్రులు, కుటుంబ సభ్యుల అశ్రునయనాల మధ్య కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబుకు ప్రజానీకం తుది వీడ్కోలు పలికింది. మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ పారిశ్రామికవేత్త, దొమ్మేరు జమిందారు పెండ్యాల వెంకట కృష్ణారావు మంగళవారం హైదరాబాద్‌లో అనారోగ్య కారణాలతో కన్నుమూసిన సంగతి తెలిసిందే. కృష్ణబాబు భౌతికకాయాన్ని మంగళవారం రాత్రి పది గంటలకు కొవ్వూరు మండలం దొమ్మేరు స్వగ్రామానికి తీసుకువచ్చారు. అప్పటి నుంచి బుధవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు అభిమానులు, కార్యకర్తల సందర్శనార్థం ఉంచారు. తమ స్నేహితుడిని కడసారి చూసుకునేందుకు అటు తెలంగాణ, ఇటు ఆంధ్రా ప్రాంతాల నుంచి నాయకులు పోటెత్తారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా అభిమానులు, కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో కొవ్వూరు నియోజకవర్గం దొమ్మేరు గ్రామం జనంతో నిండిపోయింది. తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన కృష్ణబాబు స్నేహితులు, మంత్రులు, ఎమ్మెల్యేలు కృష్ణబాబు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణబాబు సోదరులు నరేంద్రనాథ్ చౌదరి, అచ్చిబాబులను పరామర్శించారు. మధ్యాహ్నం మూడు గంటలకు అంతిమయాత్ర ప్రారంభమైంది. దొమ్మేరు గ్రామంలోని రాష్ట్ర రహదారి పక్కన ఉన్న వారి పొలాల్లో కృష్ణబాబు కుమారుడు రవిబాబు దహన సంస్కారాలు నిర్వహించారు. కృష్ణబాబు మృతి వార్త తెలిసిన వెంటనే విచ్చేసిన పలువురు ప్రముఖులు, పార్టీలకతీతంగా దొమ్మేరు విచ్చేసి కృష్ణబాబు సోదరులు ది ఆంధ్రసుగర్స్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల నరేంద్రనాథ్‌చౌదరి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు)లతో పాటు కృష్ణబాబు కుటుంబ సభ్యులను కలిసి సంతాపం వ్యక్తం చేశారు. కృష్ణబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారిలో తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, మాజీ మంత్రులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, వడ్డే శోభనాద్రీశ్వరరావు, పితాని సత్యనారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అరిమిల్లి రాధాకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, గంటా మురళి, జొన్నకూటి బాబాజీరావు, ఎమ్మెల్యేలు జి.శ్రీనివాసనాయుడు, జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు, జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, నన్నపనేని రాజకుమారి, బోళ్ల రాజీవ్, అర్బన్‌బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమని రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మాజీ జడ్పీ చైర్మన్లు ముళ్లపూడి బాపిరాజు, ఇమ్మణి రాజేశ్వరి, నాయకులు ఆళ్ల హరిబాబు, కోడూరి శివరామకృష్ణ, సూరపనేని చిన్ని సూర్యదేవర రంజిత్, మద్దిపట్ల సురేష్, కేవీకే రంగారావు, కుందుల సత్యనారాయణ, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, అల్లూరి విక్రమాదిత్య, కొవ్వూరు పట్టణ, మండల టీడీపీ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకులు మండవ లక్ష్మణరావు, మద్దిపాటి నాగేశ్వరరావు, దేవీ సీఫుడ్స్ డైరెక్టర్ పొట్రు బ్రహ్మానందం, శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, కొవ్వూరు, తణుకు, సగ్గొండలలోని ఆంధ్రసుగర్స్ గ్రూపు సంస్థల ఉద్యోగులు, సిబ్బంది, జిల్లా నలుమూలల నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన, వైసీపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో దొమ్మేరు చేరుకుని కృష్ణబాబుకు నివాళులు అర్పించారు. అంతిమయాత్రలో కృష్ణబాబు సోదరులు ది ఆంధ్రసుగర్స్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల నరేంద్రనాథ్‌చౌదరి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు), కృష్ణబాబు ఇద్దరు కుమారులు వెంకట్రాయుడు, రవిబాబు (ఎండీ విభాస్ పోలిమర్స్), కుమార్తె అర్చన అల్లుడు ఎస్.రాజీవ్‌కృష్ణ, నవభారత్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ బోళ్ల రాజీవ్, కృష్ణబాబు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసమే తపించేవారు : మంత్రి తుమ్మల

కృష్ణబాబుతో తనకు అవినాభావ సంబంధం ఉండేదని, ఎప్పుడూ నియోజకవర్గ అభివృద్ధి కోసమే పరితపించేవారని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కృష్ణబాబు అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ కృష్ణబాబు మరణం నియోజకవర్గానికి తీరని లోటన్నారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ఆయన శాసనసభ్యునిగా కొనసాగిన కాలంలో చేపట్టారన్నారు. హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా ప్రజాసేవలో ఉండి మచ్చలేని నాయకుడిగా కృష్ణబాబు నిలిచారన్నారు. కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించుకుంటారన్నారు. ప్రజల హృదయాల్లో ఆయన చిరస్మరణీయుడిగా ఉంటారన్నారు. నెల్లూరు జిల్లా వెంకటగిరి శాసనసభ్యుడు ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ కృష్ణబాబు స్నేహానికి ప్రాణం ఇచ్చేవారని, నాలుగు దశాబ్దాలుగా ఇద్దరం ఎంతో సన్నిహితంగా మెలిగామని, ఆయన లేనిలోటు తీరనిదని అన్నారు.



ఇమ్మణి రాజేశ్వరి, కందుల దుర్గేష్



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి

దొంగ అరెస్టు..రిమాండ్‌కు తరలింపు

రాజమహేంద్రవరం, మే 22(ఆంధ్రజ్యోతి): బొమ్మూరు పోలీసులు ఒక దొంగను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ ఉమర్ తెలిపిన వివరాల ప్రకారం.. దివాన్‌చెరువు జీరో పాయింట్ వద్ద లారీలను ఆపి డ్రైవర్ల వద్ద నుంచి డబ్బులు, సెల్‌ఫోన్లు దొంగిలించడం, ఇళ్లల్లో దొంగతనాలపై ఇటీవల ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి నిఘా పెట్టారు. ఈ క్రమంలో తన సెల్ దొంగిలించారంటూ ఓ డ్రైవరు చెప్పాడు. దర్యాప్తులో భాగంగా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సెల్ ఉన్న ప్రదేశాన్ని గుర్తించారు. ఆ సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా దివాన్‌చెరువు హైస్కూల్ వద్ద ఒక వ్యక్తిని బుధవారం అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించి మహారాష్ట్రలోని అంతరగావ్‌కి చెందిన నన్న గోపాల్ షిండే ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. అతడిని ప్రశ్నించగా దొంగతనాలు తానే చేస్తున్నట్లు చెప్పాడని సీఐ పేర్కొన్నారు. షిండే నుంచి వెండి వస్తువులను రికవరీ చేశామని.. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే రాత్రి వేళల్లో గస్తీ పెంచామని చెప్పారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని ఆయన కోరారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రత్తిపాడు, మే 22: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు హైవేపై బుధవారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..ఏలేశ్వరం మండలం లింగంపర్తి గ్రామానికి చెందిన విపర్తి తలుపులయ్య (35) ప్రత్తిపాడులోని బంధువుల ఇంటికి వచ్చి మంగళవారం వచ్చాడు. బుధవారం వేకువ జామున లింగంపర్తి వెళుతుండగా హైవేపై గుర్తు తెలియని వాహనం ఢీకొనగా తలుపులయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్యాచారం కేసులో ఇద్దరు యువకుల అరెస్టు

గొల్లప్రోలు, మే 22: వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడ్డ ఇద్దరు యువకులను పోలీసులు బుధవారం సాయంత్రం అరెస్టు చేశారు. గొల్లప్రోలు పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను దిశ డీఎస్పీ ఆర్.రామచంద్రరావు వెల్లడించారు. పట్టణంలోని ఉన్న ఓ మకాంలో ఒంటరిగా జీవిస్తున్న 60 ఏళ్ల వృద్ధురాలిపై ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడిన సంగతి తెలిసిందే. దీంతో దర్యాప్తు చేయగా ఈ సంఘటనకు పాల్పడిన సామర్లకోటకు చెందిన కోటా చంద్రశేఖర్, తొండంగి మండలం ఏవీ నగరం గ్రామానికి చెందిన కాలబోయిన గంగాధర్‌ను రైల్వేస్టేషన్ సమీపంలో అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. వీరిని గురువారం కోర్టులో హాజరు పరచనున్నట్లు చెప్పారు. సమావేశంలో గొల్లప్రోలు ఎస్‌ఐ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి మృతిపై అనుమానాలు

పూడ్చిపెట్టిన మృతదేహాన్ని వెలికితీసి పంచనామా నిర్వహించిన వైనం

రౌతులపూడి, మే 22: బాలుడు అనుమానాస్పద మృతిపై తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రౌతులపూడి ఎస్‌ఐ అబ్దుల్ నబీ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో పారుపాక గ్రామానికి చెందిన పారుపల్లి రాంబాబు, వెంకటలక్ష్మి కుమారుడు సాకేత్(6) ఈనెల 16న వరుసకు మేనమామ అయిన కుసిరెడ్డి శ్రీనుతో కలిసి బైక్‌పై రౌతులపూడి నుంచి పారుపాక వెళ్తుండగా రౌతులపూడి గ్రామ శివారు బైక్ అదుపు తప్పి కిందపడిపోయాడు. తలకు గాయం కాగా వైద్య పరీక్షల నిమిత్తం కాకినాడ న్యూరో స్టార్ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యం పొందుతూ 16వ తేదీన మృతిచెందాడు. సాకేత్ మృతిచెందిన రోజు బంధువులు రావడంతో తల్లి దండ్రులు ఏ ఫిర్యాదు చేయలేదు. ప్రస్తుతం బాలుడు మృతిపై అనుమానం రావడంతో బుధవారం వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. తహశీల్దార్ విద్యావతి సమక్షంలో వైద్యులు పాతిపెట్టిన బాలుడు మృతదేహానికి పంచనామా నిర్వహించి మళ్లీ మృతదేహాన్ని పాతి పెట్టినట్టు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందని దర్యాప్తు అనంతరం మేనమామ కుసిరెడ్డి శ్రీనుపై చర్యలు తీసుకోనున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

కాకినాడ

నేడు ముత్యాలమ్మతల్లి జాతర

కొత్తపల్లి, మే 22: కొత్తపల్లి గ్రామ దేవత, ఆడపడుచుగా విరాజిల్లుతున్న శ్రీముత్యాలమ్మ తల్లి జాతర గురువారం నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. జాతర ముందు రోజు (బుధవారం) జాగరణ చేసిన అనంతరం మరుసటి రోజు గురువారం జాతర నిర్వహించడం నుంచి సంప్రదాయంగా వస్తుంది. జాతర సందర్భంగా గ్రామస్తులు, బంధువులు తల్లికి మొక్కులు చెల్లించుకుని దర్శనం చేసుకుంటారు.

అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం సంఘటనపై దర్యాప్తు


పిఠాపురంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద పోలీసు బందోబస్తు

పిఠాపురం, మే 22: పట్టణంలోని అగ్రహారం వద్ద భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి గుర్తు తెలియని వ్యక్తులు గాట్లు పెట్టి పాక్షికంగా ధ్వంసం చేసిన సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అక్కడ సమీపంలో ఉన్న సీసీ కెమేరాల ఫుటేజీలను సేకరించారు. ఈ సంఘటన ఏ సమయంలో జరిగింది, ఎవ్వరు చేశారు తదితర అంశాలపై వారు విచారణ సాగిస్తున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి అవమానం జరిగిన నేపథ్యంలో ఆ ప్రాంతంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

'విగ్రహాన్ని ధ్వంసం చేసినవారిని శిక్షించాలి'

తాళ్లరేవు, మే 22: పిఠాపురంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను పోలీసులు అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని తాళ్లరేవు మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ బుధవారం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా బుధవారం సంఘం అధ్యక్షుడు వెంటపల్లి చంద్రమౌళి మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన దుండగులు ఎంతటివారైనసరే చట్టపరంగా చర్యలు తీసుకొని తగిన బుద్ధిచెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం కార్యదర్శి దున్నా సుబ్రహ్మణ్యం, గంటా రమేష్, జక్కల ప్రసాద్‌బాబు, మోర్త భైరవమూర్తి పాల్గొన్నారు.

హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

తుని రూరల్, మే 22: జాతీయ రహదారిని ఆనుకుని ఒక మహిళను దారుణంగా హత్య చేసి పడేసిన కేసుపై రూరల్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. హత్యకు సంబంధించి కొన్ని కీలక ఆధారాలు బయట పడినట్టు తెలిసింది. హంతకులు తుని, పాయకరావుకు చెందినవారే అయ్యిఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. వారి కదలికలు, ముఖ చిత్రాలను పలు కూడలిలో సీసీ కెమెరాల్లో కనుగొన్నట్లు తెలుస్తుంది. మృతురాలు బంధువులు ఆచూకీ తెలియడంతో వారికి సమాచారం అంద జేసి పోలీసులు రప్పించారు. మృతురాలు వివరాలపై ఆరా తీసి శవ పంచనామాలు అనంతరం మృతదేహాన్ని కుటుంబికులకు అప్పగించనున్నట్టు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

'కాలుష్య రహిత కాకినాడ లక్ష్యంగా కార్యాచరణ'

కార్పొరేషన్ (కాకినాడ), మే 22: పర్యావరణ పరిరక్షణ ద్వారా కాకినాడ నగరాన్ని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు వివిధ సంస్థలు, శాఖల సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. ఇంటర్నేషనల్ కౌన్సిల్‌ఫర్ లోకల్ ఎన్విరాన్‌మెంటల్ ఇనోవేషన్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పర్యావరణ కార్యాచరణ ప్రణాళికపై సమావేశం నిర్వహించారు. వాహనాల వల్ల వచ్చే కాలుష్యాన్ని తగ్గించడంతోపాటు, అధిక విద్యుత్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ లోకల్ ఎన్విరాన్‌మెంటల్ ఇన్నోవేషన్ సౌత్ ఏషియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మణికుమార్, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహరావు, ఎస్ఈ పి.సత్యకుమారి, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, అదనపు డీఎఫ్‌వో శ్రీనివాస్, వాతావరణశాఖ ప్రతినిధి రమేష్‌బాబు, సైంటిస్టు వి.రమణ, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఈఈ సందీప్‌రెడ్డి, నోడల్ అధికారి చక్రవర్తి పాల్గొన్నారు.

'ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని దుర్వినియోగం చేయరాదు'

కాకినాడ సిటీ, మే 22: దళితుల రక్షణ కోసం ఉద్దేశించిన ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని దుర్వినియోగం చేయరాదని, తప్పుడు కేసుల బారిన పడిన బాధితులు సరైన ఆధారాలతో తమను సంప్రదిస్తే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సహాయ, సహకారాలు అందిస్తామని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దోకుబుర్ర భద్రం మాస్టారు, డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సాపే సుధాకర్ వెల్లడించారు. స్థానికంగా బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ కొంతమంది ఈ చట్టాన్ని దుర్వినియోగం చేయడమే కాకుండా పోలీస్ స్టేషన్‌ల్లో తప్పుడు కేసులు పెట్టి సామాన్యులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. కొందరు దళిత నాయకులం అనే ముసుగేసుకుని ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని ఉపయోగించుకుంటూ అమాయక ప్రజలనుంచి డబ్బులు లాక్కునేలా ప్రవర్తిస్తున్నారన్నారు. తప్పుడు కేసులు బనాయించి మానవహక్కుల ఉల్లంఘన చేస్తూ ఎవరినైనా మానసికంగా ఇబ్బంది పెడితే ఆ కేసుల బారిన పడిన బాధితులు తమను సంప్రదించాలన్నారు.

'కార్మికోద్యమ నేత పర్సా చిరస్మరణీయుడు'

కాకినాడ సిటీ, మే 22: బొగ్గు గని కార్మికుడిగా పనిచేస్తూ కార్మికులపై సాగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా, ఆకలి లేని సమాజ స్థాపనకోసం తన జీవితాన్ని అర్పించిన కార్మికోద్యమ నేత పర్సా చిరస్మరణీయుడని నేతలు కొనియాడారు. కచేరీపేటలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం స్వాతంత్ర్య సమరయోధుడు, రాష్ట్ర సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు పర్సా సత్యనారాయణ వర్ధంతిని నిర్వహించారు. సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ కార్మికోద్యమ నేత పర్సా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కోశాధికారి మలకా రమణ అధ్యక్షత వహించారు. బేబీరాణి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంలో సీఐటీయూ సంఘాన్ని స్థాపించి అనేక కార్మిక ఉద్యమాలకు నాయకత్వం వహించారని తెలిపారు. కార్యక్రమంలో ఆశా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, రాణి, సిరామిక్ కార్మికులు పాల్గొన్నారు.

'కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలి'

సర్పవరం జంక్షన్, మే 22: నెలరోజుల కిందట అక్రమంగా తొలగించిన రాక్ సిరామిక్ కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు మేడిశెట్టి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సర్పవరం జంక్షన్‌లో ఆర్వో కార్యాలయంలో ఆర్డీవో ఇట్ల కిషోర్‌కు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ 22 మంది కార్మికులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా అక్రమంగా తొలగించారన్నారు. కార్మికులకు న్యాయం చేయాల్సిందిగా రెండుసార్లు జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సమక్షంలో కంపెనీ నిర్వాహకులతో సమావేశం పెట్టినా యాజమాన్యం వైఖరిలో ఏ మార్పులేదన్నారు. కార్మికశాఖ, రాక్ యాజమాన్యంతో జాయింట్ మీటింగ్ వేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆర్డీవో హామీ ఇచ్చినట్టు వెంకటరమణ తెలిపారు. యూనియన్ నాయకులు చంద్రశేఖర్, సతీష్, రాజబాబు, రామచంద్రయ్య, సత్యనారాయణ ఉన్నారు.

'ఖరీఫ్‌కు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలి'

గొల్లప్రోలు రూరల్, మే 22: రానున్న ఖరీఫ్ సీజన్‌కు ముందస్తుగానే తగిన కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని గొల్లప్రోలు మండల వ్యవసాయాధికారి సత్యనారాయణ సూచించారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో యాక్షన్‌ప్లాన్ తయారీపై రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి బుధవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. రైతు భరోసా కేంద్రంలో ఎరువుల పంపిణీ, పంట సాగు పద్ధతులు, రైతులు ఆసక్తి చూపుతున్న వరి రకాలు, పత్తి, మొక్కజొన్న, అపరాల సాగు అంశాలపై అవగాహన కల్పించారు. రైతులను కలిసి వారి అభిప్రాయాలు సేకరించి యాక్షన్‌ప్లాన్‌లో పొందుపరచాలన్నారు.

'తాగునీటి సమస్యపై దృష్టి సారించాలి'

రౌతులపూడి, మే 22: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్యపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం నందు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీపీ రాజ్యలక్ష్మి అధికారులను ఉద్దేశించి మాట్లాతూ గ్రామాల్లో తాగునీటితో పాటు పారిశుధ్యం తదితర సమస్యలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ముందుగా వ్యవసాయం, విద్య, వైద్య తదితర శాఖపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమసాగర్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల గ్రామాల అధికారులు పాల్గొన్నారు.

'పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలి'

ఏలేశ్వరం, మే 22: ప్రతీ ఒక్కరూ పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలని మండల విద్యాశాధికారి ఎంఈవో అబ్బాయి అన్నారు. బుధవారం గ్రంథాలయ శిక్షణ శిబిరంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ వేసవి శిక్షణా తరగతులలో నీతి కథలు, గణితం, స్పోకెన్ ఇంగ్లీషు, డ్రాయింగ్, జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించి వివిధ పుస్తకాలు చదవడం అలవర్చుని వాటిపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపల్లి, మే 22: కొత్తపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 33కేవీ విద్యుత్ లైన్‌పై ఉన్న చెట్ల కొమ్మలను తొలగించు నిమిత్తం గురువారం మూలపేట నుంచి కోనపాపపేట వరకు గల గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పెద్దాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అల్లంరాజు ప్రభాకరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు శ్రీరాంపురం, ముమ్మిడివారిపోడు, కోనపాపపేట, రావివారిపోడు, రామరాఘవపురం, హేచరీలు, రమణక్కపేట, నాగులాపల్లి చెరువులు, శీలంవారిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల వితరణ

కాకినాడ రూరల్, మే 22: కాకినాడ రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 15 మంది వృద్ధులకు నెలకు సరిపడే రూ.1800 విలువైన నిత్యావసర సరుకులు, చెప్పులు, గొడుగులను బుధవారం పూర్వ విద్యార్థులు పంపిణీ చేశారు. వీటిని పూర్వ విద్యార్థి దొమ్మేటి శివరాం సమకూర్చినట్లు ట్రస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ బాదం బాలకృష్ణ తెలిపారు. పాపారావు, జగన్నాధం, కళ్యాణి ప్రసాద్, చరణ్ ఉన్నారు

వీధి దీపాల నిర్వహణ ఇలాగేనా?

» ఏలేశ్వరంలో పగటి పూట వెలుగులు

» పట్టించుకోని అధికారులు


ఏలేశ్వరంలో పగలు వెలుగుతున్న వీధి ధీపాలు, మెయిన్ రోడ్డులో స్తంభానికి బల్బులేని దృశ్యం

ఏలేశ్వరం, మే 22: ఏలేశ్వరం నగర పంచాయితీలో వీధి ధీపాల నిర్వహణ అధికారులకు ఏమాత్రం పట్టడంలేదు. పగలూ రాత్రి తేడాలేకుండా వెలుగులు జిమ్ముతున్నాయి. అధికారులు పట్టించుకోక పోవడంతో ప్రజా ధనం వృథాగా మారుతుంది. పట్టణంలో దిబ్బలపాలెం, సాయినగర్, సువ్వయ్యమ్మపేట, శివాలయం వీదుల్లో వీధి ధీపాలు నిత్యం పగలూ కూడా వెలుగుతూనే ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. పలు వీధుల్లో పగటి పూట కూడా దీపాలు వెలుగుతూనే ఉండడంతో విద్యుత్ బిల్లు తడిసిమోపుడవుతుంది. ఇప్పటికే ప్రతీనెలా నగర పంచాయితీ వేలల్లో బిల్లు చెల్లిస్తుంది. విద్యుత్ పొదుపు చర్యలు పాటించకపోవడంతో నగర పంచాయితీపై అదనపు భారం పడుతోంది. అధికారులు ప్రజాధనాన్ని దుర్వినియోగం చెయ్యకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అంధకారంలో పలు ప్రాంతాలు

పట్టణంలో వీధి ధీపాల నిర్వహణ సక్రమంగా లేదు. మెయిన్ రోడ్డు, క్వారీపేట, అంబేడ్కర్ నగర్, నందివీధులలో రాత్రి వేళ దీపాలు వెలగక ప్రాంతాలు అంధకారంలో ఉంటున్నాయి. అలాగే దిబ్బలపాలెం, మెక్కారావు కాలనీలో విద్యుత్ స్తంభాలు ఉన్నా వాటికి బల్బులు లేకపోవడంతో రాత్రి వేళ రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

ప్రధాన రహదారులు, కూడళ్లలో ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీజు కటౌట్‌లకు ఎటువంటి రక్షణ కవచాలు ఏర్పాటు చేయలేదు. మార్కెట్ రోడ్డు, మెయిన్ రోడ్డు, పెద్దవీధిలలో ఇళ్ల, దుకాణాల మధ్య ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. వర్షాలు రావడంతో ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి మంటలు సైతం వస్తున్నాయి. పలు కాలనీల్లో ఇళ్లపైనే విద్యుత్ ఉండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వర్షం పడితే ఇళ్లకు కూడా విద్యుత్ సరఫరా అవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ తీగలు మార్చాలని ప్రజలు కోరుతున్నారు.


ఇళ్ల మధ్యలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు

» అల్లర్లు, దాడులు జరగకుండా నాయకులు సహకారం అందించాలి

» జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ, హాజరైన వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు

సర్పవరం జంక్షన్, మే 22: జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు చేశామని.. కౌంటింగ్ రోజు, తర్వాత అల్లర్లు, దాడులు జరగకుండా నాయకులు సహకారం అందించాలని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ కోరారు. బుధవారం సర్పవరం జంక్షన్‌లో స్పందన ఫంక్షన్ హాల్లో జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో శాంతి భద్రతల పరిరక్షణపై రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జూన్ 4న జరిగే కౌంటింగ్ నిర్వహణకు అత్యంత కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన వారు పరాజయం పొలైన వారిపై ఎటువంటి దాడులు, దౌర్జన్యాలకు పాల్పడకుండా రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం వాటిల్లే విధంగా ఎవరు ప్రయత్నించిన ఎన్నికల సంఘం నిబంధనల మేరకు కఠిన చర్యలు తప్పవన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రౌడీ షీటర్లను రాజకీయ నాయకులు ప్రోత్సహించరాదన్నారు. ప్రతీ రౌడీషీటర్ ఏదో రాజకీయ పార్టీ గొడుకు కిందకు చేరుతున్నారన్నారు. వీరిపై ఉక్కుపాదం తప్పదన్నారు. 18-20 ఏళ్లలోపు వారికి భయం లేకుండా ఉన్నారని, ఇది ఏమాత్రం మంచిది కాదని, ఒకసారి కేసుల్లో ఇరుక్కుంటే వీరి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో చిన్న సంఘటనలు మినహా జిల్లాలో ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా నాయకులు, ప్రజలు సహకరించడంతో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించామన్నారు. కౌంటింగ్ రోజు, కౌంటింగ్ ముగిసిన తర్వాత ఎక్కడా ఎటువంటి అల్లర్లు జరగకుండా నాయకులు పోలీసులకు సహకారం అందించాలని కోరారు. జిల్లాలో 144 సెక్షన్, సెక్షన్ 30 అమల్లో ఉందన్నారు. ఎవరైనా సెలబ్రేషన్స్ చేసుకోవాలంటే తప్పనిసరిగా జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకోవాలని అనుమతి లేకుండా ఏ సెలబ్రేషన్స్ అనుమతించేది లేదన్నారు. సమావేశంలో ఎస్‌డీపీవో హనుమంతరావు, కాకినాడ రూరల్ సర్కిల్ సీఐ కె.శ్రీనివాస్, సర్పవరం ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్, పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.


మాఢ వీధుల్లో పుష్ప వాహనంలో విహరిస్తున్న స్వామివారు

వైభవంగా భావనారాయణస్వామి కల్యాణోత్సవాలు

సర్పవరం జంక్షన్, మే 22: కాకినాడ రూరల్ సర్పవరంలో శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి దివ్య కల్యాణ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. 6వ రోజు బుధవారం శ్రీరాజ్యలక్ష్మి, భావనారాయణుడు విశేష పుష్పాలంకరణ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్వామివారు పుష్ప వాహనంలో బయలుదేరి మాఢ వీధుల్లో విహరించారు. ముందుగా స్వామివారికి ఆలయ పండితులు సుప్రభాత సేవ, ప్రత్యేక అర్చనలు, విశేష ద్రవ్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సాయంత్రం అంబేడ్కర కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన జాతీయస్థాయి కూచిపూడి కళాకారిణి రావి బేబీ సత్యవాణి ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. గురువారం ఉదయం 8 గంటలకు సూర్యారావుపేట బీచ్‌లో స్వామివారికి సముద్రంలో చక్రస్నానం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో జొన్నాడ భీమశంకరరావు తెలిపారు.

కౌంటింగ్ సెంటర్ సందర్శన

కార్పొరేషన్ (కాకినాడ), మే 22: కాకినాడ జేఎన్టీయూకే ఆవరణలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్‌ను జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి బుధవారం సందర్శించారు. సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావుతో కలిసి కౌంటింగ్ సెంటర్‌లో ఏర్పాట్లను పర్యవేక్షించారు. కౌంటింగ్ సందర్భంగా విధి నిర్వహణలో ఉండే సిబ్బందికి, కౌంటింగ్ నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై సూచనలు ఇచ్చారు.

ఎమ్మెల్యే రాజప్ప ప్రత్యేక పూజలు


మీనాక్షీ అమ్మవారి ఆలయంలో రాజప్ప దంపతులు

సామర్లకోట, మే 22: పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అనూరాధ దంపతులు బుధవారం పుణ్యక్షేత్రాల సందర్శనలో భాగంగా మధురైలోని మధుర మీనాక్షీ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శ్రీరంగంలోని రంగనాధునిని దర్శించి పూజలు నిర్వహించారు. రాత్రి పళనిలోని సుబ్రహ్మణ్య స్వామివారి ఆలయానికి చేరుకుని సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజప్ప దంపతులకు పండితులు, అధికారులు స్వాగతం పలికారు. వేదాశీర్వచనం చేసి ప్రసాదాలు, దేవతామూర్తుల చిత్రపటాలను అందజేశారు. రాజప్ప తనయుడు రంగనాగ్,సత్యన్నారాయణరాజులు ఉన్నారు.

లక్ష్మీగణపతి ఆలయంలో పూజలు

సామర్లకోట, మే 22: సంకట హర చతుర్థి, బుధవారం మహాపర్వదినం సందర్భంగా సామర్లకోట మెహెర్ కాంప్లెక్స్ వద్ద వేంచేసియున్న లక్ష్మీగణపతి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు తురుమళ్ళ శేష కుమార్ ఆధ్వర్యంలో గణపతికి పంచద్రవ్యములతో అభిషేకించారు. అలాగే విశేష పుష్పార్చన పూజలు చేశారు.

పూర్తిస్థాయిలో విద్యా సామగ్రి పంపిణీకి కృషి

విద్యాశాఖ ఆర్జేడీ నాగమణి


స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఆర్జేడీ

సామర్లకోట, మే 22: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1.59 లక్షల మంది విద్యార్థులకు అచ్చుపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు, షూలు, ఏకరూప దుస్తులు తదితర విద్యా సామగ్రిని పాఠశాల ప్రారంభం రోజు నాటికే పంపిణీ పూర్తిస్థాయిలో నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని విద్యాశాఖ ఆర్జేడీ నాగమణి వెల్లడించారు. సామర్లకోట ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణలో పుస్తకాల స్టాక్ పాయింట్‌ను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ తన పరిధిలో కాకినాడ జిల్లా నుంచి ఎన్టీఆర్ జిల్లా వరకూ 7 జిల్లాల పరిధిలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విద్యా సామగ్రిని సరఫరా చేసే పనులు ముమ్మరం చేశామన్నారు. ఆయా స్టాక్ పాయింట్లలో విద్యా సామగ్రిని భద్రపరిచి పాఠశాలలు తెరిచి విద్యార్థులకు పంపిణీ చేసే వరకూ ఆయా మండలాల విద్యాశాఖాధికారులదే బాధ్యత అన్నారు. ప్రతీ విద్యార్థికి అచ్చు పుస్తకాలతో పాటు తరగతి ఆధారంగా నోట్‌పుస్తకాలు అందజేస్తామన్నారు. ప్రతీ విద్యార్థికి 3 జతల యూనిఫాం అందజేస్తామన్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో మండలాలకు విద్యా సామగ్రి సరఫరా ప్రారంభమైందన్నారు. సామర్లకోట మండలానికి వచ్చిన నోట్‌పుస్తకాలకు చెంది గణాంక సమాచారాన్ని ఎంఈవోల ద్వారా సేకరిస్తుండడంతో పాటు స్వయంగా స్టాక్ పాయింట్లను తాను తనిఖీలు చేస్తున్నానని ఆర్జేడీ తెలిపారు. అంతకుముందు సామర్లకోట స్టాక్ పాయింట్‌కు చేరిన నోట్‌పుస్తకాలను ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట సామర్లకోట ఎంఈవో-2 వి.పుల్లయ్య, గిరిజన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవ ప్రసాద్ తదితర సీఆర్పీలు సుబ్రహ్మణ్యం, ప్రసన్న, శ్రీనివాస్, తనూజ, వీర్రాజులు పాల్గొన్నారు.

ప్రమోషన్ల జాబితాల పరిశీలన

సామర్లకోట మండల విద్యా వనరుల కేంద్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి చెందిన ఆయా పాఠశాలల్లో విద్యార్థుల ప్రమోషన్ల జాబితాల తయారీని ఆర్జేడీ పరిశీలించారు. సామర్లకోట ఎంఆర్‌సీ కార్యాలయాన్ని సందర్శించారు. ఉపాధ్యాయుల సర్వీస్ రిజిష్టర్లను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, నూతనంగా పాఠశాలల్లో చేరే వారి సంఖ్యను ఎంఆర్‌సీ సిబ్బంది ద్వారా సేకరించారు. సామర్లకోట ఎంఈవో-1 వై.శివరామకృష్ణయ్య సమాచారాన్ని ఆర్జేడీ సేకరించారు. సామర్లకోట ప్రభుత్వ గిరిజన ఉన్నత పాఠశాలకు హాజరుకావాలని ఆర్జేడీ ఆదేశించడంతో ఎంఈవో చేరుకున్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

డీఎంహెచ్‌వో నరసింహ నాయక్


రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

సర్పవరం జంక్షన్, మే 22: గర్భిణులకు మెరుగైన వైద్యసేవలందించేలా చర్యలు తీసుకోవాలని, వారి ఆరోగ్య సమగ్ర సమాచారాన్ని ఏఎన్ఎంలు ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహ నాయక్ కోరారు. బుధవారం కాకినాడ రూరల్ పండూరు పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోగులకందిస్తున్న వైద్య సేవలు, ఓపీ వివరాలు, మందుల పంపిణీ, సిబ్బంది సేవలు, గర్భిణీలకునెలవారీ పరీక్షలపై రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వైద్యులు సమయపాలన పాటించి గ్రామీణ ప్రాంత వాసులకు వైద్య సేవలందించాలన్నారు. కిస్కా కార్యక్రమంలో భాగంగా గర్భిణుల ఆరోగ్య సూత్రాలు తెలియజేసే వాయిస్ కాల్స్‌పై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ కె. మాధవి, గైనకాలిజిస్ట్ డాక్టర్ నిరీక్షణ, డీపీఎంవో డాక్టర్ సురేఖ, హెల్త్ సూపర్‌వైజర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు సజావుగా సాగేందుకు సహకరించాలి

సర్పవరం జంక్షన్, మే 22: ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కాకినాడ రూరల్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఇట్ల కిషోర్ కోరారు. బుధవారం సర్పవరం జంక్షన్‌లో ఆర్వో కార్యాలయంలో వివిధరాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓట్ల లెక్కింపుపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 4న ఓట్ల లెక్కింపు నిర్వహిస్తామన్నారు. ఓట్ల లెక్కింపు కోసం 18 టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 6 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థులు,ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లు తెరవడం జరుగుతుందన్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్‌కు చెందిన ఓట్ల లెక్కింపు జరుగుతుందని,ఇందుకు 4 టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. మిగతా ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

'ఫోన్లు అనుమతించం'

ప్రత్తిపాడు, మే 22: ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ఫోన్‌లు అనుమతించరని ప్రత్తిపాడు ఆర్వో ఎ.శ్రీనివాసరావు తెలిపారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆర్వో మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఆటోను ఢీకొన్న లారీ

ఇద్దరికి గాయాలు


మల్లేపల్లిలో ప్రమాదానికి గురైన ఆటో

గండేపల్లి, మే 22: మండలంలో మల్లేపల్లి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గండేపల్లికి చెందిన గుద్దాడ గంగరాజు, బూసారి వెంకన్నకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం ప్రకారం.. గంగరాజు ఆటోలో మల్లేపల్లి నుంచి గండేపల్లికి సిమ్మెంటు తూరలు వేసుకొస్తూ హైవే పక్కన నిలుపగా విజయవాడ నుంచి వైజాగ్ వెళ్లే లారీ ఆటోను ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. దీంతో డ్రైవర్ గంగరాజుకు కాలు ఫ్యాక్చర్ అవ్వగా వెంకన్నకు స్వల్పగాయాలయ్యాయి. వారిలో 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు లారీ, డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నారు. లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్టు స్థానికులు చెబుతున్నారు.

ఏలేరు కాలువలో పడి వ్యక్తి గల్లంతు

రౌతులపూడి, మే 22: రౌతులపూడి గ్రామశివారు ఏలేరు కాలువలో పడి గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన సికోలు వీరబాబు గల్లంతయ్యాడు. రౌతులపూడిలో ఓ ఫంక్షన్‌కు బంధువులతో కలిసి వచ్చిన అతడు తిరిగి వెళ్తూ ఏలేరు కాలువలో స్నానం చేయడానికి దిగి గల్లంతయ్యాడు. ఈతగాళ్లు గాలింపు చర్యలు చేపట్టారు. పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చినట్టు బంధువులు తెలిపారు.

యనమలను కలిసిన టీడీపీ నేతలు


యనమలను కలిసిన ఆనందరావు

తుని రూరల్, మే 22: రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడును తేటగుంటలో పలువురు టీడీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. అమలాపురం మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, పెద్దాపురం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప, జిల్లాకు చెందిన పలువురు నేతలు యనమలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఓటింగ్ సరళి, పరిస్థితులపై చర్చించినట్టు తెలుస్తుంది.

జ్యోతుల నెహ్రూ పరామర్శ



జగ్గంపేట, మే 22: జిల్లా టీడీపీ విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షుడు మండపాక అప్పన్నదొర తండ్రి మండపాక పద్దరాజు ఇటీవల మరణించారు. బుధవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ ఎన్నికల కో ఆర్డినేటర్ ఎస్వీఎస్ అప్పలరాజులు అప్పన్న దొర కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పద్దరాజు చిత్రపటానికి అంజలి ఘటించారు. టీడీపీ మండ లాధ్యక్షుడు మారిశెట్టి భద్రం, జేవీఆర్ గ్రూప్స్ అధినేత జీనుమణిబాబు, రాష్ట్ర టీడీపీ యువత ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు, టీడీపీ పట్టణాధ్యక్షుడు పాంద్రంగి రాంబాబు పాల్గొన్నారు.

నెహ్రూను కలిసిన టీడీపీ నాయకులు

గండేపల్లి, మే 22: మండలంలోని మల్లేపల్లి గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జగ్గంపేటలో టీడీపీ ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో జరిగిన ఎన్నికల సరళిపై విశ్లేషించారు. పలు విషయాలు చర్చించారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు తెలగరెడ్డి భద్రరావు, వల్లభశెట్టి కోటేశ్వరరావు, కొల్లి త్రిమూర్తులు, శ్రీనివాసరావు, దార్లంక శ్రీనివాసరావు, ఇంటి సత్యనారాయణ, పంచికట్ల కనకరాజు, తణుకు దుర్గారావు, పిల్లా సత్తిబాబు, కంచర్ల సుబ్రహ్మణ్యం, అక్కిరెడ్డి సత్తిబాబు పాల్గొన్నారు.

డ్రోన్స్ వినియోగంపై అవగాహన

పెద్దాపురం, మే 22: స్థానిక వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డ్రోన్స్‌పై చిన్నారులకు బుధవారం అవగాహన కల్పించారు. వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా డ్రోన్స్‌పై జమీల్ ఆలీ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ప్రత్యక్షంగా డ్రోన్ ఎగురవేసి భవిష్యత్తులో డ్రోన్స్ వల్ల కలిగే మరిన్ని ప్రయోజనాలను వివరించారు. పలు చిత్రకళలపై అవగాహన కల్పించారు. దుంగల పూజిత, సూర్యశ్రీ కరాటే, కర్రసాముపై నీలపాల కృష్ణ శిక్షణ ఇచ్చారు. చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ రొంగల అరుణ్, బుద్ధా శ్రీనివాస్, మంజుల, అమృత, నేహ, రేణుక తదితరులున్నారు.

లయన్స్‌క్లబ్ ఆర్థికసాయం

తాళ్లరేవు, మే 22: తాళ్లరేవు పంచాయతీ రత్సవారిపేటకు చెందిన లివర్‌వ్యాధితో బాధపడుతున్న రచ్చ విజయ్‌కుమార్‌కు తాళ్లరేవు లయన్స్‌క్లబ్ రూ.10వేలు నగుదును ఆర్థిక సాయం అందజేసినట్టు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బిల్లకుర్తి శ్రీనివాసరెడ్డి తెలిపారు. లయన్స్‌క్లబ్ సభ్యులు పొన్నాడ రాజు, ఏలూరి సూర్యనారాయణ, నున్న దత్తు, రాయపరాజు, కట్టా ఆదినారాయణ, నడింపల్లి వినోద్ తదితరులు ఉన్నారు.